క్లుప్తంగా

బక్రీద్ శుభాకాంక్షలు


శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

పుట్టపర్తి టౌన్ : పుట్టపర్తి నియోజకవర్గంలోని ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగం, దానధర్మాలకు ప్రతీకగా బక్రీద్ నిర్వహి స్తారన్నారు. అల్లా దయ అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుక ముస్లిం కుటుంబాల్లో సుఖ సంతో షాలని కోరారు. ఈమేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎన్జీఓ అసోసియేషన్ తాలూకా కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి


నూతన కార్యదర్శిని సన్మానిస్తున్న ఎన్జీఓ అసోసియేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎన్జీఓ హోమ్‌లో ఆదివారం అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్షుడు డాక్టర్ ఉరుకుందప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్జీఓ అసోసియేషన్ కార్యదర్శిగా తాడిమర్రి తహసీల్దార్‌గా పనిచేస్తున్న భాస్కర్‌రెడ్డిని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్జీఓ అసోసియేషన్ సభ్యులు ఆయనను శాలువా లతో సత్కరించారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి


శ్రీనివాసులు(ఫైల్)

కొత్తచెరువు: మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు(55) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. ఎర్రబల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న శ్రీనివాసులు కొన్ని సంవత్సరాలుగా క్యాన్సర్‌తో బాధపడు తున్నాడు. ఆరు నెలలుగా మెడికల్ లీవ్‌లో ఉంటూ అనంతపురం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. సోమవారం లోచర్లలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ప్రశాంతంగా జీవించండి


గూనిపల్లిలో ప్రజలకు సూచనలిస్తున్న ఎస్‌ఐ సురేష్

పుట్టపర్తి: సార్వత్రిక ఎన్నికలు ముగిశాయని గ్రామాల్లో గొడవలు లేకుండా అన్ని పార్టీల వారు ప్రశాంతంగా జీవించాలని బుక్కపట్నం ఎస్‌ఐ సురేష్ బాబు సూచించారు. గూనిపల్లి గ్రామంలో ఆదివారం సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలకు దిగకుండా ఉండాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వృద్ధులకు అన్నదానం

ధర్మవరం రూరల్: గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులు, అనాథలకు ఫాదర్స్‌డే సందర్భంగా ఆదివారం తన తండ్రి ఆదినారాయణరెడ్డి జ్ఞాపకార్థం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నేలకోట మురళీధర్‌రెడ్డి అన్నదానం చేశారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేస్తమా.. కుశలమా


గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

రామగిరి: మండలంలోని కుంటిమద్దిలోని ఉన్న సదానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984–85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలవడంతో సందడి వాతావరణం నెలకొంది. ఆనాటి తీపి జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ గురువుల సేవలను కొనియాడారు. ప్రధానోపాధ్యాయుడు అనంత పద్మనాభం, ఉపాధ్యాయులు అశ్వర్థనారాయణ, శర్మ తదితరులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీదేవి, కిష్టప్ప, రవి, జయప్ప, చంద్ర, సులోచన, రాజశేఖర్, తిరుపాల్, కామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాము కాటు.. ప్రాణానికి చేటు!

- వర్షా కాలంలో పాముల బెడద
- ఏమరపాటుగా ఉంటే ప్రాణాలకే ముప్పు
- పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదాలు
- వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తప్పనిసరి
- స్థానిక ఆస్పత్రుల్లో అందుబాటులో మందులు

ధర్మవరం రూరల్: వర్షా కాలంలో పాములు ఎక్కువగా కనిపిస్తుంటాయి. పుట్టలు, పొదల్లోకి వర్షం నీరు చేరడంతో అవి బయటకు వస్తుంటాయి. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఏ మాత్రం అజాగ్రత్తగా వున్నా పాము కాటుకు గురికాక తప్పదు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు అధిగమించవచ్చునని వైద్యులు సూచిస్తున్నారు. ఏటా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు పాములు, ఇతర విష కీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా పాములు ఎలుకలను, కప్పలను తినేందుకు బయట తిరుగుతూ చెట్ల పొదల్లో ఉంటాయి. అలాంటి సమయంలో అప్రమత్తంగా ఉంటూ ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు నిర్లక్ష్యం వహించకూడదు. ముఖ్యంగా పాము కాటేస్తే ఒంటిపై రెండు లేదా నాలుగు కామా ఆకారపు గుర్తులు పడతాయి. అరగంటలోపు విషం ఒళ్లంతా పాకి నాడి వ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. కళ్లు మూతలు పడడం, చేతులు, కాళ్లకు తాత్కాలికంగా పక్షపాతం రావడం, మాట ఆగిపోవడం, నాలుకకు రుచి తెలియకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రక్త పింజరి కరిచిన భాగం ఉబ్బి తీవ్రంగా నొప్పి కలిగిస్తుంది. అరగంటలో నోరు, చెవుల్లో నుంచి రక్తస్రావం జరుగుతుంది. పాము కాటు వేసిన భాగాన్ని ఎక్కువగా కదిలించరాదు. ఆ భాగాన్ని బట్టతో లేదా టవల్‌తో గట్టిగా కట్టాలి. ఇలా చేయడం వల్ల విషం శరీరంలోకి వ్యాపించదు. కట్టును పది నిమిషాలకు ఒకసారి వదిలి మళ్లీ కడుతూ ఉండాలి. పాము కాటు వేసిన చోట కొత్త బ్లేడుతో ప్లస్ గుర్తు మాదిరి ఒక సెంటీమీటర్ లోపలి వరకు కోయాలి. కాసేపటికి విషంతో కూడిన రక్తం దానంతట అదే బయటకు వస్తుంది. సాధ్యమైనంత తొందరగా సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లితే విషానికి యాంటీ వీనమ్(విరుగుడు మందు) తీసుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు.


విష పూరిత నాగుపాము

అన్ని పాములు ప్రమాదం కాదు

మనకు కనిపించే అన్ని పాములు విష పూరితం కాదని వైద్య నిపుణులు అంటున్నారు. నాగు పాము, కట్ల పాము, రక్త పింజరి వంటి పాముల వల్లే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. పాము కాటేసిన వెంటనే వైద్యం చేయించుకుంటే ఎలాంటి సమస్య ఉండదు.

రక్త పింజరి

అత్యంత ప్రమాదకర పాముల్లో ఇది ఒకటి. ఎక్కువగా అటవీ ప్రాంతంలో సంచరిస్తుంటుంది. ఈ పాము కాటు వేస్తే క్షణాల్లో రక్తం గడ్డ కట్టడం ప్రారంభమవుతుంది. శరీర అవయవాలు పనిచేయడం ఆగిపోతుంది. ఈ పాము కాటు వేసిన వెంటనే అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆస్పత్రులకు వైద్యం చేయించుకోవాలి.

నాగు పాము

నాగుపాము అత్యంత ప్రమాదకరమైంది. ఈ పాము కాటు వేస్తే 15 నిమిషాల్లో విషం ఎక్కుతుందని వైద్యులు చెబుతున్నారు. ముందుగా పాము కాటు వేసిన చోట వెంటనే కట్టు కట్టాలి. కాటుకు గురైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించాలి. నాగుపాము విషం ప్రధానంగా నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

కట్లపాము

కట్లపాము కాటువేసిన వెంటనే విషం రక్తంలో కలుస్తుంది. ప్రాణాపాయం ఎక్కువ. పాము కాటు వేసిన వెంటనే ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించాలి. కట్లపాము విషం రక్తంలోకి చేరక ముందే వైద్య చేయిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం వుంది.


అత్యంత ప్రమాదకరమైన కట్లపాము

ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లో 13 కేసులు

ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లోని తాడిమర్రి, ముదిగుబ్బ, ధర్మవరం రూరల్, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన 13 మంది ఇటీవల పాము కాటుకు గురైనట్లు వైద్యులు, 108 సిబ్బంది చెబుతున్నారు. వీరంతా పాము కాటు వేసిన వెంటనే ధర్మవరం ప్రభుత్వాసుపత్రి, బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రులలో చికిత్సలు చేయించుకున్నారు. వారంతా ప్రాణాపాయం నుంచి బయట పడినట్లు వైద్యులు పేర్కొన్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకూడదు. తీవ్రమైన ఒత్తిడికి గురైతే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది.
- పాము కాటు వేయగానే గాయాలు పై భాగంలో కట్టు కట్టాలి. దీని వల్ల విషం శరీరానికి పాకకుండా నివారించవచ్చు.
- ఏ పాము కాటు వేసిందో తెలుసుకొని యాంటీ వీనమ్(విషానికి విరుగుడు) తీసుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు.
- రైతులు రాత్రి పూట పొలాలకు వెళ్లేటప్పుడు కాళ్లకు చెప్పులు, టార్చిలైట్లతో పాటు శబ్దాలు చేసే పరికరాన్ని వెంట తీసుకొని వెళ్లడం వల్ల పాము కాటు నుంచి రక్షించుకోవచ్చు.

పాము కాటుకు అందుబాటులో మందులు



దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాము కాటుకు మందులున్నాయి. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు పొలం పనులలో అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో పొలాలకు వెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలి. పచ్చి గడ్డి, ఎండు పుల్లల కింద పాములు ఉండే అవకాశం వుంది. గడ్డి కోసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పాము కాటుకు గురైతే వెంటనే స్థానిక ఆసుపత్రులకు తీసుకెళ్లాలి. ఎటువంటి పరిస్థితుల్లో కూడా నాటు వైద్యం పనికిరాదు. నాటు వైద్యం ప్రాణాలకే ప్రమాదం. పాము కాటుకు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో మందులు అందుబాటులో ఉంటాయి. పాము కాటుకు గురైన వ్యక్తి శరీరంలో మార్పులు రాకుండా తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

– పుష్ప, దర్శనమల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యురాలు

పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు అందుకున్న అమ్మవారు

తాడిమర్రి: స్థానిక పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్ప మాలలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పూజారి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పోతలయ్య స్వామికి పూజలు


దాదులూరు పోతలయ్య స్వామి మూలవిరాట్

కనగానపల్లి: మండలంలోని దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్య స్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బోనాలు ఎత్తుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయంలోని పోతలయ్య, చెన్నేకేశవ స్వాములను దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం

- కౌన్సిలర్ వెంకటేశ్ భవన సముదాయాన్ని ఖాళీ చేయాలంటూ హుకుం

ధర్మవరం: పట్టణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల దౌర్జన్యాలు మితిమీరుతున్నాయి. పట్టణంలోని ఎల్‌సీకేపురంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మేడాపురం వెంకటేశ్‌కు సంబంధించిన భవన సముదాయంలోని దుకాణాలను ఖాళీ చేయాలంటూ స్థానిక టీడీపీ నాయకులు షాపుల వద్దకు వెళ్లి బెదిరించారు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ మేడాపురం వెంకటేశ్ తమ షాపుల వద్దకు వచ్చి ఎందుకు దౌర్జన్యం చేస్తున్నారని ప్రశ్నించారు. దుకాణాల వద్ద ఉన్న సామగ్రిని బయటకు వేయడంతో వ్యాపారులు భయభ్రాంతులకు గురయ్యారు. కౌన్సిలర్ మేడాపురం వెంకటేశ్ మాట్లాడుతూ టీడీపీ నాయకుల దౌర్జన్యం మితిమీరి పోతోందన్నారు. తాము అన్ని అనుమతులతో భవన సముదాయాన్ని నిర్మించుకున్నామన్నారు. కేవలం కక్ష సాధింపు కోసమే వ్యాపారులను ఖాళీ చేయాలని టీడీపీ నాయకులు బెదిరించడం దారుణమన్నారు. ఏదైనా ఫిర్యాదు అందింతే మున్సిపల్ అధికారులు తమకు తెలియజేయాలే తప్ప అధికారులు రాకుండా టీడీపీ నాయకులు వచ్చి భయభ్రాంతులకు గురి చేయడం హేయమైన చర్య అన్నారు. టీడీపీ నాయకుల దౌర్జన్యాలపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

శాంతిభద్రతలకు ముప్పు



గతంలో తాళంవేసి ఉన్న షట్టర్ గది, షట్టర్ తాళం పగలకొట్టి రేకులు వేసుకుంటున్న దృశ్యం

ఓడీచెరువు: పోలీసులు తీరు శాంతిభద్రతలకు ముప్పు కలిగించేలా ఉందని జెడ్పీటీసీ కుర్లి దామోదర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓడీచెరువు మండలం ఎంబీ క్రాస్ వద్దనున్న స్థలం విషయమై కుర్లి ఉత్తమరెడ్డి కుమారులు కుర్లి నరిసిరెడ్డి, రంగారెడ్డి, రాజారెడ్డి, దామోదర్రెడ్డికి భీమిశెట్టి రామచంద్ర కుటుంబ సభ్యులు వీరయ్య, రమణయ్య, గంగాదేవి, భార్గవి, రాజేశ్వరి మధ్య చాలా కాలంగా వివాదం కొనసాగుతోందన్నారు. సదరు స్థలం కోర్టు పరిధిలో ఉన్నందున గతంలో స్థానిక ఎస్‌ఐ సమక్షంలో కోర్టు తీర్పు వచ్చేవరకు షట్టర్ తాళం వేసి తాళం చెవి పోలీసుల ఆధీనంలో ఉండేలా అంగీకారం కుదిరిందన్నారు. అయితే సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత ఎస్‌ఐ వంశీకృష్ణ కోర్టు పరిధిలో ఉన్న విషయాన్ని పట్టించుకోకుండా తాళం పగులగొట్టి షట్టర్‌ను తెరిపించారని, ఇలా చేయడంవల్ల శాంతిభద్రతలు దెబ్బతింటాయని, సదరు ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని సత్యసాయి జిల్లా ఎస్పీకి విన్నవించినట్లు జెడ్పీటీసీ తెలిపారు.

పంట రుణాలు మాఫీ చేయాలి

కనగానపల్లి: పంట దిగుబడులు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని మండల రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏపీ రైతు సంఘం నాయకులు నాగరాజు, బాలరాజు, మల్లికార్జున రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులు, పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు చాలా నష్టాల పాలవుతున్నారు. పంట పెట్టుబడుల కోసం బ్యాంకుల్లో చేసిన పంట రుణాలు కూడా తీర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతుల రుణాలు మాఫీ చేసి ఆదుకోవాలన్నారు. వీటితో పాటు రైతులకు సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు రైతు సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

'నీట్' దోషులను కఠినంగా శిక్షించాలి

హిందూపురం: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలంటూ ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏఐడీఎస్‌ఓ నాయకురాలు భవ్య అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర నాయకుడు మల్లికార్జున్ దత్‌కుమార్ మాట్లాడుతూ నీట్ ఫలితాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నారన్నారు. ఒకే పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసిన విద్యార్థులందరికీ ఒకటే స్కోరు రావడం విచిత్రంగా ఉందన్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహణకు ముందే ప్రశ్నపత్రాలు లీక్ చేసి ఒక్కొక్కరి వద్ద రూ.30 నుంచి రూ.35 లక్షల వరకూ నగదు తీసుకున్నారని దోషులు ఒప్పుకున్నట్లు చెప్పారు. ఇప్పటికే కొందరు విద్యార్థులు ఫలితాలు సరిగా రానందున ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. నీట్ ప్రక్రియపై న్యాయ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఏఐడీఎస్‌ఓ డిమాండ్ చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఐడీఎస్‌ఓ హిందూపురం నాయకులు పూజిత, రితీష, భవ్య, జ్యోష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తంచేస్తున్న ఏఐడీఎస్‌ఓ నాయకులు

రేపటి నుంచి సబ్సిడీ కందుల పంపిణీ

తాడిమర్రి: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు రైతులకు మంగళవారం నుంచి సబ్సిడీపై విత్తన కందులు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి రమాదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్జీ 52 రకం కిలో కందుల ధర రూ.98 ప్రకారం 4 కిలోల కందుల బ్యాగుకు రూ.396 చెల్లించాలని పేర్కొన్నారు. మండలంలోని తాడిమర్రి, ఎం.అగ్రహారం, నార్సింపల్లి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో కందులను పంపిణీ చేస్తారని తెలిపారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకళ్లు తీసుకుని ఆర్బీకేల్లో సంప్రదించాలని సూచించారు.

రేపు వారపు సంత వేలం

ఓడీచెరువు: మండల కేంద్రంలో వారపుసంత, లోడింగ్ అన్‌లోడింగ్ ఫీజులు వసూలు హక్కు కోసం మంగళవారం ఉదయం 11 గంటలకు సర్పంచు గోవిందు, మండల విస్తరణ అధికారి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించనున్నారు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న వారు వారపుసంత, లోడింగ్ అన్‌లోడింగ్ హక్కు కోసం వేర్వేరుగా రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాల్గొనవచ్చని సూచించారు. వేలంపాటలో పాల్గొనదలచినవారు పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండకూడదని పేర్కొన్నారు.

దుకాణాల టెండర్లపై రేపు అవగాహన

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో ఈనెల 18న ఉదయం 11 గంటలకు ఔత్సాహిక వ్యాపారవేత్తలతో అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం మైనోద్దీన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పుట్టపర్తిలో ఈ నెల 27న జరిగే స్టాల్స్ టెండర్స్‌పైన అవగాహన కల్పించేందుకు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కదిరి ఆర్టీసీ బస్టాండ్‌లో హోటల్, ఎగ్జిబిషన్, సెల్‌ఫోన్ షాపులు, గోడౌన్, గుజరీ దుకాణం, ఆఫీసుల నిర్వహణపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

మొబైల్ షాపులో చోరీ

ముదిగుబ్బ: మండల పరిధిలోని పాముదుర్తి క్రాస్‌లో ఓ మొబైల్ షాపులో చోరీ జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. దాము అనే వ్యక్తి పాముదుర్తి క్రాస్ వద్ద ప్రిన్స్ పేరుతో మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు షాపులో చొరబడి రూ.25 వేలు విలువ చేసే మొబైల్ సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

స్టాక్ పాయింట్ల ఆకస్మిక తనిఖీ


నిత్యావసరాలను తూకం వేయిస్తున్న ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి


నిత్యావసరాల ప్యాకెట్ల తూకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రావణి

ధర్మవరం అర్బన్: ధర్మవరం డివిజన్ పరిధిలోని స్టాక్ పాయింట్లను ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలో ఉన్న ధర్మవరం, చెన్నేకొత్తపల్లి, ముదిగుబ్బ మండలాల్లోని స్టాక్ పాయింట్లలో ఉన్న కందిపప్పు, నూనె తదితర వాటిని పరిశీలించారు. చక్కెర నిల్వ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఎక్కడా ఎలాంటి అవకతవకలు జరగకూడదని స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్‌లను ఆర్డీఓ ఆదేశించారు. తూకాల్లో తేడా రాకూడదని, ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులను అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తనిఖీల్లో రెవెన్యూ అధికారులు లక్ష్మిదేవి, శారద, రమాదేవి, అంపయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: పోరెడ్డివారిపల్లి సమీపంలో ఉన్న పౌరసరఫరాల గిడ్డంగిని తహసీల్దార్ డి.శ్రావణి ఆదివారం సాయంకాలం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గిడ్డంగిలో ఉన్న చక్కెర, పామాయిల్, కందిబేడలను పరిశీలించారు. వాటి తుకాల్లో ఏమైనా తేడాలు ఉన్నయోమోనని స్టాకు పాయింట్‌లో ఉన్న వేయింగ్ మిషన్‌లో చూశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనునన్నట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్‌తో పాటు సీఎస్‌డీటీ సురేంద్ర, గిడ్డంగి ఇన్‌చార్జ్ బాబురావు ఉన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

పుట్టపర్తి టౌన్: తనపై దాడి చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని లారీ డ్రైవర్ గంగాద్రి పోలీసులను కోరాడు. ఈమేరకు పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ కృష్ణమూర్తికి ఆదివారం ఫిర్యాదు చేశాడు. బాధితుడి తెలిపిన వివరాలు.. బుక్కపట్నం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గంగాద్రి లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం లారీలో సిమెంట్ పలకలు బెంగుళూరులో అన్‌లోడ్ చేసి వస్తుండగా మామిళ్లకుంట క్రాస్ వద్దకు రాగానే లారీ టైర్ పంక్చరైంది. టైర్ బోల్ట్‌లు విప్పుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మాట మాట కలిపి సెల్ ఇవ్వమని, డబ్బు ఇవ్వమని బెదిరించి అతడిపై దాడి చేశారు. అదే సమయంలో కొత్తచెరువు నుంచి కారులో వస్తున్న నలుగురు వ్యక్తులు అడ్డుకోగా వారు పారిపోయారు. కొంత సమయానికి మళ్లీ దాడికి ప్రయత్నించగా మళ్లీ కొత్తచెరువు నుంచి వస్తున్న ఇద్దరు వ్యక్తులు అతడిని కాపాడారు. పారిపోతున్న దుండగులను టూవీలర్‌లో వెంబడించి ఇద్దరి పట్టుకొని స్టేషన్‌కు అప్పగించగా మరొకరు తప్పించుకొని పారిపోయారు. స్పందించిన ఎస్‌ఐ నిందితులను వెంటనే త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

కారు – ద్విచక్ర వాహనం ఢీ

- వ్యక్తికి తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న లింగేగౌడ్

అగళి: మండల పరిధిలోని రామనపల్లి గ్రామ సమీపంలో ఆదివారం కారు –ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో దొక్కలపల్లి గ్రామానికి చెందిన లింగేగౌడ్ తలకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు... ఇరిగేపల్లి గొల్లహట్టి రెడ్డప్ప తన కారులో అగళి నుంచి రొళ్ల వైపు వెళుతున్నారు. అలాగే రొళ్ల నుంచి అగళి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనంలో లింగేగౌడ్ వెళ్తున్నారు. కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో లింగేగౌడ్‌కు బలమైన రక్తగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన రొళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తాతయ్య జీవసమాధి మహోత్సవం


కైవారం తాతయ్య జీవసమాధి మహోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

హిందూపురం: సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో క్షేత్రం కైవారం తాతయ్య 189 జీవ సమాధి మహోత్సవాన్ని ఆదివారం స్థానిక కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. జీవ సమాధి మహోత్సవం సందర్భంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకూ అఖండ రామభజన కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 700 మంది భక్తులు కీర్తనలు పాడుతూ నగర సంకీర్తన చేశారు. అనంతర అభిషేక పూజలు నిర్వహించారు. పూజల తర్వాత పెద్ద ఎత్తున అన్నదాన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కైవారం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు బాగేపల్లి నరసింహయ్య కృష్ణయ్య, కుప్పం వెంకటాచలపతి, అరుణ్, హిందూపురం భక్తబృందం అశ్వత్థనారాయణస్వామి, కోన పీఠాధిపతి చంద్రస్వామి, రాజప్ప, అయ్యప్ప, చౌడమ్మ గంగాధరప్ప, నాగరాజు, రవిశంకర్, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర భక్తులు పాల్గొన్నారు.